


హెచ్ఐవి చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలి

ఇషా ఆసుపత్రి వైద్యులు బొర్రా మురళీకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

హెచ్ఐవి సోకిన చిన్నారులు క్రమం తప్పకుండా మందులు వాడుతూ, పౌష్టికాహారం తీసుకోవాలని ఇషా ఆసుపత్రి వైద్యులు బొర్రా మురళీకృష్ణ సూచించారు. శుక్రవారం తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలోని ఎఆర్‌టి సెంటర్‌లో హెచ్ఐవి సోకిన చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యం అందిస్తూ, అవసరమైన వారికి రెండు సంవత్సరాలుగా దాతల నుండి సేకరించిన పౌష్టికాహారాన్ని అందిస్తున్నామన్నారు. హెచ్ఐవి సోకిన చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించిన ఇషా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ బొర్రా మురళీకృష్ణను అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిషోర్‌కుమార్, ఎఆర్‌టి సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీకారమా.. అభివృద్ధా..!


డిఇఒకు వినతిపత్రం అందిస్తున్న నేతలు (ఫైల్‌ఫొటో)

ఎంఎల్‌ఎల ప్రమాణ స్వీకారం పూర్తి
ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని అంతా వేడుకోలు
పలు నియోజకవర్గాల్లో కక్షసాధింపు రాజకీయాలకు ఆజ్యం
మధ్యాహ్న భోజన కార్మికులు తప్పుకోవాలనే ఒత్తిళ్లపై చర్చ
గత ప్రభుత్వంలోనూ ఇదే పరిస్థితి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎంఎల్‌ఎలుగా గెలిచి ప్రమాణ స్వీకారం చేసిన నాయకులు తమ నియోజకవర్గాల్లో అభివృద్ధిపై దృష్టి సారించాలని, గత ప్రభుత్వం కొనసాగించిన కక్ష సాధింపు రాజకీయాలకు స్వస్తి పలకాలని అంతా కోరుకుంటున్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత పలు నియోజకవర్గాల్లో చోటుచేసుకుంటున్న ఘటనలు గత ప్రభుత్వంలో జరిగిన దౌర్జన్యకాండను గుర్తు చేస్తున్నట్లు సర్వత్రా చర్చ సాగుతోంది. ఇదేవిధంగా ముందుకు సాగితే నూతన ప్రభుత్వం కొద్దికాలంలోనే ప్రజాగ్రహానికి గురికాక తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రెండు జిల్లాల్లో గెలిచిన 14 మంది ఎంఎల్‌ఎల్లో ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ మినహా మిగిలిన 13 మంది శుక్రవారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఇక నుంచి అధికారికంగా ప్రజాప్రతినిధి హోదాలో బాధ్యతలు నిర్వహించనున్నారు. జిల్లాలోని అన్ని నియోకజవర్గాల్లోనూ అనేక సమస్యలతో జనం సతమతవుతున్నారు. తాగడానికి నీరులేదు. ఎంతోమంది పేదలకు ఉండేందుకు ఇల్లు లేదు. పిల్లల చదువు కోసం నానా కష్టాలు పడుతున్నారు. రోడ్లు లేవు. ఉపాధి లేమి వెంటాడుతోంది. పండించిన పంటకు మద్దతు ధర దక్కడం లేదు. విద్యుత్ బిల్లుల పేరుతో ప్రభుత్వ పథకాలు నిలిచిపోయాయి. ఇలా అనేక సమస్యలతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో రకంగా సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. ప్రజాప్రతినిధులు ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తే జనాలకు ప్రయోజనం చేకూరుతుంది. అయితే ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత దెందులూరు, ఏలూరు వంటి నియోజకవర్గాల్లో కక్ష సాధింపు రాజకీయాలు ప్రారంభమయ్యాయనే చర్చ నడుస్తోంది. ఏలూరు నియోజకవర్గంలో ఇప్పటికే ప్రత్యర్థులకు సంబంధించిన హోటళ్లు, దుకాణాలు మూయించి ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టడం వంటి ఘటనలపై జనంలో చర్చ సాగుతోంది. వైసిపి కౌన్సిలర్లను అధికార పార్టీలోకి రావాలని ఒత్తిళ్లు కొనసాగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. దెందులూరు నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి ఉందని చెబుతున్నారు. మధ్యాహ్న భోజన కార్మికులను వారు చేస్తున్న పనుల నుంచి తప్పుకోవాలని, లేకపోతే తామే తప్పిస్తామని హుకుం జారీ చేసినట్లు కార్మికులు చెబుతున్నారు. తమపై వస్తున్న బెదిరింపులపై జిల్లా విద్యాశాఖ అధికారికి మధ్యాహ్న భోజన కార్మికులు వినితిపత్రం ఇవ్వడం చూస్తే పరిస్థితి ఏవిధంగా ఉందో స్పష్టమవుతోంది. మిగిలిన నియోజకవర్గాల్లోనూ కక్షసాధింపు రాజకీయాలు సాగుతున్నట్లు జనాల్లో చర్చ సాగుతోంది. దీంతో ప్రభుత్వం ఏర్పడి పట్టుమని వారం రోజులు కాకముందే గత ప్రభుత్వానికి, వీరికి తేడా ఏమిటనే చర్చ నడుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఎంఎల్‌ఎలు పూర్తిగా నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేశారు. సంక్షేమ పథకాలపై ప్రచారం తప్ప జనాలకు అవసరమైన రోడ్లు, తాగునీరు వంటి కనీస సదుపాయాలను సైతం పరిష్కరించని పరిస్థితి ఉంది. పోలవరం నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలోనూ విఫలమయ్యారు. చింతలపూడి ఎత్తిపోతల బాధిత రైతులకు న్యాయమైన పరిహారం ఇప్పించేందుకు ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. కొల్లేరులో రెగ్యులేటర్ల నిర్మాణాన్ని పట్టించుకోలేదు. ధాన్యం కొనుగోలులో సంచులు, లారీల సమస్యలను సైతం పరిష్కరించకుండా అధికారులు చెప్పిందే వేదం అన్నట్లు వ్యవహరించారు. అంతేకాకుండా మట్టి, ఇసుక అక్రమ తవ్వకాలు, భూముల కబ్జాలు భారీగా సాగిన పరిస్థితి ఉంది. ఎవరైనా సమస్యలపై ప్రశ్నిస్తే ప్రభుత్వ పథకాలు ఆపేస్తామని బెదిరించడం నిత్యకృత్యంగా ఉండేది. ఈ ప్రభుత్వంలోనైనా కక్ష సాధింపు రాజకీయాలకు స్వస్తి పలికి, అభివృద్ధిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ అధినేతలు సైతం ఎంఎల్‌ఎలకు ఆవిధంగా దిశానిర్దేశం చేయాలని కోరుతున్నారు. మరి జిల్లాలో ఎంఎల్‌ఎలు ఏవిధంగా ముందుకు సాగుతారో వేచిచూడాలి.

కూరగాయలు సబ్సిడీపై అందించాలి

జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్


అధికారులతో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రైతుబజార్ల ద్వారా కూరగాయలను సబ్సిడీ ధరలకు అందించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కూరగాయలను వినియోగదారులకు సబ్సిడీపై అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్‌లో కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో కూరగాయల ధరలు రోజురోజుకీ పెరుగుతున్న దృష్ట్యా సంబంధిత శాఖల అధికారులతో కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఏ రకాలు ఏఏ ప్రాంతాల్లో పండుతాయో అక్కడ నుండే నేరుగా కొనుగోలు చేసి రైతు బజార్ల ద్వారా సబ్సిడీ ధరల్లో విక్రయించడానికి ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. మదనపల్లెలో టమాట ఎక్కువగా దొరుకుతుందని, అక్కడి నుండి టమాటాను కొనుగోలు చేయాలని సూచించారు. రానున్న రెండు రోజుల్లో ధరల్లో హెచ్చుతగ్గులను బేరీజు వేసుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. భీమవరం రైతు బజార్‌కు సంబంధించిన సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా రైతు బజార్‌లోని ఆర్‌ఒ ప్లాంటును రూ.40 వేలతో వెంటనే మరమ్మతు చేయించాలన్నారు. నాలుగు మరుగుదొడ్ల మరమ్మతులకు సంబంధించి ప్రతిపాదనలను అందజేయాలన్నారు. రైతు బజార్లో ఏర్పాటు చేసిన మాంసం దుకాణాల ముందు ధరలను తప్పక ప్రదర్శించాలని ఆదేశించారు. వినియోగదారులకు ఇబ్బంది లేనివిధంగా పార్కింగ్ ప్లేస్‌లో వాహనాల పార్కింగ్‌కు చర్యలు తీసుకోవాలని ఎస్టేట్ అధికారికి సూచించారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ టి.శివరామ్‌ప్రసాద్, డిఎస్‌ఒ ఎన్.సరోజ, జిల్లా ఉద్యాన శాఖాధికారి ఆర్.దేవానంద్‌కుమార్, జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి కె.సునీల్‌కుమార్, భీమవరం రైతుబజార్ ఎస్టేట్ అధికారి ఆర్.కళ్యాణ్, ఇన్‌ఛార్జి జిల్లా వ్యవసాయాధికారి కెఎఎస్ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ ఆస్తుల అమ్మకం ఆపాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విశాఖ స్టీల్‌ప్లాంట్ ఆస్తుల అమ్మకం ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఆస్తులను కేంద్ర ప్రభుత్వం అమ్మకానికి పెట్టి దానిని దెబ్బ తీయాలని చూడటం దారుణమన్నారు. మూడోసారి అధికారం చేపట్టిన కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం, హైదరాబాద్, ముంబై, చెన్నయ్, పూణేల్లో ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్ ఆస్తుల్ని అమ్మేయాలని నిర్ణయం తీసుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయన్నారు. ఇది ఆంధ్రా ప్రజలను చాలా ఆందోళనలకు గురిచేస్తోందన్నారు. విశాఖ ఉక్కు ప్రజల హక్కు అని, 32 మంది ప్రాణత్యాగాల ఫలితం విశాఖ స్టీల్‌ప్లాంట్ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మొద్దని సంవత్సరాల తరబడి అక్కడ ప్రజానీకం, కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు పోరాటాలు చేస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కూడా ఆందోళనలు జరుగు తున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గనులు కేటాయించకపోయినా విశాఖ స్టీల్‌ప్లాంట్ లాభాల బాటలో నడుస్తోందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కోవిడ్‌లో అనేక మందికి ఆక్సిజన్ ఇచ్చి ప్రాణాలు కాపాడిందని, ఇప్పుడు దాని ఊపిరి తీయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తుందని, ఇది చాలా దుర్మార్గమని బలరాం అన్నారు. ఇటీవలే ప్రమాణ స్వీకారం చేసిన ఉక్కు, గనుల శాఖ సహాయ మంత్రి, నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం కానీయబోమని, అమ్మకానికి పెట్టబోమని, దానికి మైనింగ్ కేటాయిస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. ఆ మాట చెప్పి నాలుగు రోజులు గడవకముందే దాని ఆస్తులను అమ్మడం అంటే ఇంతకంటే వంచన మరొకటి లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి తక్షణం విశాఖ ఉక్కు ఆస్తుల అమ్మకాన్ని ఆపేలా చర్యలు తీసుకోవాలని, దానికి గనులు కేటాయించేలా చూడాలని బలరాం కోరారు.

ఎస్‌టి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - భీమవరంటౌన్

వీరవాసరం ఎస్‌టి కాలనీలో మౌలిక వసతుల మెరుగుదలకు సంబంధిత అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్ వద్ద కలెక్టర్ సుమిత్‌కుమార్ వీరవాసరంలోని ఎస్‌టి కాలనీ సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీరవాసరం ఎస్‌టి కాలనీ స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు ఇంతకుముందే ఒక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. కాలనీలో 82 కుటుంబాలకు సంబంధించి 251 మంది నివాసం ఉంటున్నారన్నారు. వీరికి పక్కా ఇళ్లు ఉన్నాయా లేవా, రిజిస్ట్రేషన్ పట్టాలు ఉన్నాయా, అందరికీ ఆధార్, రైస్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు, విద్యుత్ కనెక్షన్, తాగునీటి కుళాయిలు, ఎన్‌ఆర్‌ఇజిఎస్ జాబ్ కార్డ్స్, టాయిలెట్స్ తదితరాలపై ఆరా తీస్తూ వీటిలో ఏమైనా లేనివారికి వెంటనే ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన మేరకు సీసీ రోడ్లు, డ్రెయిన్ నిర్మాణాలకు పరిశీలించాలని తెలిపారు. తాగునీటి కుళాయిలకు సంబంధించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షించనున్నట్లు తెలిపారు. ఇన్సూరెన్స్ లేని వారికి బీమా చేయించాలని, ఉన్నవారికి రెన్యువల్‌కు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్కూల్ డ్రాప్ అవుట్స్ ఎవరైనా ఉంటే వెంటనే పాఠశాలలో చేర్పించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. అవసరమైన నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రానున్న రెండు నెలల్లో అన్ని వసతుల ఏర్పాటుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వీరవాసరం తహశీల్దార్ జె.సుశీల దేవి, ఎంపిడిఒ పార్థసారథి, హౌసింగ్ ఎఇ కెఎస్‌ఆర్ సిహెచ్.మూర్తి, పంచాయతీరాజ్ ఎఇ మనోహర్ పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా శ్రీనివాస్ బదిలీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆచార్య రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని మార్టేరు (నెగ్గిపూడి) వ్యవసాయ పరిశోధనా స్థానంలో ప్రధాన శాస్త్రవేత్త (వరి)గా పని చేస్తున్న డాక్టర్ టి.శ్రీనివాస్ ఇక్కడే ఎడిఆర్‌గా ఉద్యోగోన్నతి పొంది శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎడిఆర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ ధన్యంరాజు శ్రీనివాస్ తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలోని ఆచార్య రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఎడిఆర్‌ఒగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ టి.శ్రీనివాస్ కొన్ని సంవత్సరాలుగా మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానంలోనే వరి ప్రధాన శాస్త్రవేత్తగా వివిధ రకాల సేవలు అందిస్తున్నారు.


ఉపాధి కూలీల బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - పెనుగొండ

గ్రామీణ పేదల, కష్టజీవుల స్థితిగతులను మెరుగుపరిచే ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలో ఉపాధి హామీ పనులను తామరాడ, దేవ, రామన్నపాలెం, వడలి గ్రామాల్లో నేతలు పరిశీలించారు. సిపిఎం మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రెండు నెలలుగా పనులు చేస్తున్నా కూలి సొమ్ము రాలేదని రామన్నపాలెంలో కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. మెడికల్ కిట్లు, కొలతలు వేసేందుకు ఉపయోగించే టేపు ప్రభుత్వం నుండి సరఫరా లేక కార్మికులే సమకూర్చుకుంటున్నారని తెలిపారు. ఇటీవల దేవ గ్రామానికి చెందిన ఉపాధి కార్మికురాలు గుడాల లలిత పాము కాటుకు గురై అస్వస్థత పాలైందని, ఆమెకు మెరుగైన వైద్యం అందజేయాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి షేక్ పాదుషా మాట్లాడుతూ ఉపాధి నిధులు రాష్ట్ర ప్రభుత్వం తక్షణం విడుదల చేసి కార్మికులకు ఉపశమనం కలిగించాలన్నారు. అన్ని గ్రామాల్లో మెడికల్ కిట్లు అందజేయాలని డిమాండ్ చేశారు.

విద్యను వ్యాపారం చేయొద్దు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఆందోళన


డివైఇఒకు యూనిఫారమ్ చూపుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరంలోని నారాయణ విద్యాసంస్థల్లో విద్యా హక్కు చట్టానికి వ్యతిరేకంగా విద్యా వ్యాపారం జరుగుతోందని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి జి.గణేష్ తెలిపారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ విద్యా సంస్థ వద్ద ఆందోళన చేపట్టింది. ఈ నేపథ్యంలో జిల్లా ఉప విద్యాశాఖ అధికారి శ్రీరామ్ అక్కడకు చేరుకొని పాఠశాల సిబ్బందిని హెచ్చరించి విద్యాసామగ్రిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడారు. స్థానిక వంశీకృష్ణ నగర్‌లోని నారాయణ విద్యాసంస్థల్లో ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తూ విద్యా సామగ్రిని రూ.7000 నుంచి రూ.15,000 వరకూ విక్రయిస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని అనేకసార్లు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని తెలిపారు. దీంతో విద్యా సంస్థ వద్ద ఆందోళన చేపట్టామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు మొద్దునిద్ర వీడి విద్యాసంస్థల్లో పర్యటించి విద్య వ్యాపారాన్ని ఆపాలని లేకపోతే జిల్లా వ్యాప్తంగా ప్రయివేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న విద్యా వ్యాపారాన్ని ఎస్ఎఫ్ఐ అడ్డుకట్ట వేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జి.శ్రీను, బి.సిద్ధు పాల్గొన్నారు.

నివాసాల మధ్య ప్లాస్టిక్ కనికల ఫ్యాక్టరీ ఆపాలి

కలెక్టర్‌కు బాధిత ప్రాంత ప్రజల వినతి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కొల్లేరు ఐదో కాంటూరు, నివాస ప్రాంతాల మధ్య నిబంధనలకు విరుద్ధంగా పెడుతున్న ప్లాస్టిక్ కనికల తయారీ కంపెనీ ఆపాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఆ ప్రాంతవాసులు కోరారు. ఈ మేరకు బాధిత ప్రాంత ప్రజలైన ఆకివీడు సమతానగర్ ప్రాంతవాసులు కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆకివీడువాసులు భైరి ఆంజనేయులు, ఓగిరాల ఏలియా, డి.కల్యాణి, వి.శివరామరాజు, దారకొండ వెంకటేష్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి వాటిని కరిగించి ప్లాస్టిక్ కనికలుగా తయారు చేసే క్రమంలో తమ ప్రాంతం కాలుష్యమయమవుతుందన్నారు. ఐదో కాంటూరుకు ఐదు కిలోమీటర్ల వరకు ఎటువంటి కాలుష్య పరిశ్రమలు పెట్టడానికి అనుమతి లేదని, అయితే ఐదో కాంటూరు పరిధిలోనే ఈ కాలుష్య పరిశ్రమ పెట్టడానికి పనులు చేపట్టారని వారు తెలిపారు. పక్కనే ప్రభుత్వాసుపత్రి నివాస ప్రాంతాలు, నిరంతరం ప్రజలు సంచరించే రైల్వే స్టేషన్, డైలీ మార్కెట్, చేపల మార్కెట్ వంటి రద్దీ ప్రదేశాలు ఉన్నాయని, కాలుష్య పరిశ్రమ వీటి మధ్య ఉండడం వల్ల తీవ్ర నష్టాలు ఎదురవుతాయని అన్నారు. కాలుష్య ఫ్యాక్టరీ తమ ప్రాంతంలో పెట్టకుండా ఆ పనులు నిలుపుదల చేయాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్‌ను ఆ ప్రాంతానికి పంపి పరిశీలించాక తదుపరి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

పరీక్షా రాసేందుకు వెళ్తూ మృత్యుఒడికి..!

నెగ్గిపూడి లాకులు వద్ద లారీ ఢీకొని విద్యార్థిని దుర్మరణం

ప్రజాశక్తి - పెనుమంట్ర

పరీక్ష రాసేందుకు బయల్దేరిన విద్యార్థినిని లారీ రూపంలో మృత్యువు కబళించింది. ఈ విషాదకర ఘటన పెనుగొండ రోడ్డు నెగ్గిపూడి లాకుల వద్ద శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పెనుగొండ ఎస్‌వికెపి కళాశాలలో మార్టేరు శివరావుపేటకు చెందిన దేవగానుగుల గీతావాణి (23) ఎంబిఎ చదువుతోంది. ఆమెకు ఇటీవల ఉండ్రాజవరం మండలం వేలివెన్ను గ్రామానికి చెందిన పాసిక వెంకటేశ్వరరావుతో వివాహమైంది. ఆమె శుక్రవారం ఎంబిఎ సెకండియర్ పరీక్ష రాసేందుకు బయల్దేరింది. మార్టేరు-పెనుగొండ రోడ్డులోని నెగ్గిపూడి లాకుల వద్ద రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొనడంతో గీతావాణి అక్కడికక్కడే మృతి చెందింది. పెనుమంట్ర పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి చేర్చారు. ఆమె పరీక్షలు రాసేందుకు ఇటీవలే అత్తవారిల్లు వేలివెన్ను నుంచి మార్టేరులోని శివరావుపేటలో పుట్టింటికి వచ్చినట్లు బంధువులు తెలిపారు. గీతావాణి ఆకస్మిక మృతితో మార్టేరులోనూ, వేలివెన్నులోనూ విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎంఎల్‌ఎల ప్రమాణస్వీకారం


నిమ్మల రామానాయుడు, పాలకొల్లు ఎంఎల్‌ఎ


కొలుసు పార్థసారథి నూజివీడు ఎంఎల్‌ఎ


చింతమనేని ప్రభాకర్, దెందులూరు ఎంఎల్‌ఎ


ఆరిమిల్లి రాధాకృష్ణ, తణుకు ఎంఎల్‌ఎ


పులపర్తి అంజిబాబు భీమవరం ఎంఎల్‌ఎ


కనుమూరి రఘురామకృష్ణంరాజు, ఉండి ఎంఎల్‌ఎ


బడేటి రాధాకృష్ణయ్య (చంటి), ఏలూరు ఎంఎల్‌ఎ


సొంగా రోషన్‌కుమార్, చింతలపూడి ఎంఎల్‌ఎ


బొలిశెట్టి శ్రీనివాస్, తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ


పత్సమట్ల ధర్మరాజు, ఉంగుటూరు ఎంఎల్‌ఎ


బొమ్మిడి నాయకర్, నరసాపురం ఎంఎల్‌ఎ


చిర్రి బాలరాజు, పోలవరం ఎంఎల్‌ఎ


కామినేని శ్రీనివాస్, కైకలూరు ఎంఎల్‌ఎ

మల్టీటాస్క్ రోడ్డు స్కేటింగ్‌లో ధన్విక ప్రతిభ

తణుకు: మల్టీటాస్క్ రోడ్డు స్కేటింగ్‌లో 7 సంవత్సరాల చిన్నారి ప్రపంచ రికార్డు సాధించింది. అలంపురం గ్రామానికి చెందిన ఎం.ధన్విక శుక్రవారం తణుకు జాతీయ రహదారిలోని డిమార్ట్ వద్ద నుంచి సిద్ధాంతం వరకూ 18 కిలోమీటర్ల మేర మల్టీ టాస్క్ రోడ్డు స్కేటింగ్ చేసి అబ్బురపర్చింది. తొలుత టిడిపి పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, బసవ రామకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు ధ్వనిక పేరును పొందుపర్చారు. తణుకులో స్కేటింగ్ రేంజర్స్ అకాడమీలో ధన్విక కోచ్ లావణ్య వద్ద శిక్షణ పొందింది. ఈ సందర్భంగా తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ అభినందించారు.

విభిన్న ప్రతిభావంతుల్లో ఆత్మవిశ్వాసం నింపాలి

ఉండి+ విభిన్న ప్రతిభావంతులపై చూపాల్సింది జాలి కాదని, వారిలో ఆత్మవిశ్వాసం నింపాలని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం ఉండి భవిత కేంద్రంలోని విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు దాత లయన్ సాగిరాజు సాంబశివరాజు ఆర్థిక సహాయంతో స్టీలు బాక్స్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు క్లబ్ అధ్యక్షురాలు వేగేశ్న అనంత లక్ష్మి అధ్యక్షత వహించారు. క్లబ్ కార్యదర్శి కన్నెగంటి రూత్‌కళ మాట్లాడుతూ అవయవ లోపం ఉన్న వారిపట్ల చిన్న చూపు తగదన్నారు. క్లబ్ అడ్మినిస్ట్రేటర్ రుద్రరాజు నరసరాజు, క్లబ్ ఉపాధ్యక్షులు గాదిరాజు రంగరాజు మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు ఎస్.శేషయ్య, ఉపాధ్యాయులు శివరామరాజు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - ఆచంట

సేవా దృక్పథంతో విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేయడం అభినందనీయమని వల్లభనేని గురువు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిల్లా కాశ్యర్ అన్నారు. శుక్రవారం పెనుమంచిలి పంచాయతీ పరిధి వల్లభనేని గురువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అంబేద్కర్ సేవాసమితి లాకుపేట పాలకొల్లు వారి ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో సేవా దక్పథంతో విద్యార్థులకు అందించిన నోట్ పుస్తకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సేవా సమితి సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు వల్లభనేని నాగేశ్వరరావు, సిపిఎం మండల కమిటీ సభ్యులు సిర్రా నరసింహమూర్తి, ఎం.శ్రీను, వి.సుశీల పాల్గొన్నారు.

మొగల్తూరు : విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లో ముందుండాలని జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ సూచించారు. మండలంలోని కోమటితిప్ప పంచాయతీ నిలితిప్ప ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పడవల సూర్యనారాయణ, వైస్ ఎంపిపి కవురు సీతామహాలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

చురుగ్గా పంట బోదె పనులు

ప్రజాశక్తి - మొగల్తూరు



పంటబోదె తవ్వుతున్న ఉపాధి కూలీలు

మండలంలోని పలు గ్రామాల్లో పంట బోదె తవ్వకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. మొగల్తూరు పంచాయతీలోని నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం, పాలకమ్మచెరువు మండలంలోని కెపిపాలెం నార్త్, కెపి.పాలెం సౌత్, పేరుపాలెం నార్త్, పేరుపాలెంసౌత్ గ్రామాల్లో పంటబోదె పనులు చురుగ్గా జరుగుతున్నాయి. శుక్రవారం కెపిపాలెంనార్త్‌లో చేపట్టిన పనులను జెఇ ఆనంద్, టిఎ జవ్వాది వెంకటేశ్వరరావు పరిశీలించారు. శివారు భూముల్లోని ప్రతి ఎకరాకూ సాగు నీరందేలా పంటబోదె పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కూలీలకు సూచించారు.

ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజారోగ్య పరిరక్షణ కోసం వైద్య ఉద్యోగులు క్షేత్ర స్థాయిలో బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజల్ని వ్యాధుల బారి నుంచి రక్షించాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 9, 11, 12, 19, 20, 22 వార్డుల్లో పర్యటించి ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలతో మమేకమైన ఆయన పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వారంలో ఒక రోజు ఫ్రైడే డ్రైడే పాటించడం ద్వారా మలేరియా, డెంగీ నుంచి రక్షణ పొందొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు మేరీ, మంగతాయారు, వెంకటలక్ష్మి, నాగమల్లి, పోసమ్మ ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

రెండు గడ్డి వాములు దగ్ధం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని గొల్లవానిచెరువు, నాగరాజుపేట గ్రామాల పరిధిలో రెండు గడ్డివాములు గురువారం రాత్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. వడ్లవానిపాలెం పంచాయతీ పరిధిలోని గొల్లవాని చెరువు గ్రామంలో రైతు ఉప్పలపాటి రాజేష్‌కు చెందిన పది ఎకరాల గడ్డివాముకు గుర్తుతెలియని దుండగులు నిప్పు అంటించడంతో పూర్తిగా దగ్ధమైంది. ఆదేవిధంగా యాళ్లవాని గురువు పంచాయతీ పరిధిలోని నాగరాజుపేట గ్రామంలో కెవిఎస్ రాజు చెందిన 10 ఎకరాల గడ్డివాముకు కూడా గుర్తు తెలియని దుండగులు నిప్పు అంటించారు. పాలకొల్లు ఫైర్ ఆఫీసర్ వై.జానకిరామ్ సిబ్బంది, నరసాపురం ఫైర్‌ఆఫీసర్ కె.భాస్కరరావు సిబ్బందితో మంటలను అదుపు చేశారు. వీటి విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని తెలిపారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం: విద్యుత్ వినియోగదారుల సమస్యలు 60 రోజుల్లో పరిష్కరిస్తామని కన్స్యూమర్ గ్రీవెన్స్ రిడ్రెసల్ ఫోరం ఛైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం తాడేపల్లిగూడెం డివిజన్ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ ఎలక్ట్రికల్ కార్యాలయం వద్ద విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ సమస్యలుంటే 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేస్తే సమస్యను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సాంకేతిక సభ్యులు వి.జనార్దనరావు, ఆర్థిక సభ్యులు ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశపరీక్షకు 242 మంది హాజరు

ప్రజాశక్తి - నరసాపురం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని మహాత్మాజ్యోతి బాపూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలల్లో 2024 - 25 విద్యా సంవత్సరానికి గాను 7, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి శుక్రవారం గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు ప్రిన్సిపల్, కన్వీనర్ సిహెచ్.శైలజ తెలిపారు. మొత్తం 325 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 242 మంది హాజరయ్యారని, 83 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా శుక్రవారం పడాల వృద్ధాశ్రమంలో ఆర్యవైశ్య సంఘం పూర్వాధ్యక్షులు మండవిల్లి నాగేంద్రరావు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవీ ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ గ్రంధి సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొర్లపాటి రాము, కార్యదర్శి నున్న సుందరం, కోశాధికారి భోగిపల్లి రమేష్, కొనకళ్ల హరనాథ్ పాల్గొన్నారు.

సాయికి ఘన సత్కారం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరానికి చెందిన ప్రముఖ ప్రజా సేవకుడు, సంఘ సంస్కర్త పులవర్తి సాయికి ఆర్యవైశ్య లైమ్ లైట్ అవార్డు రావడంపై వాసవీ క్లబ్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు శుక్రవారం స్థానిక పులవర్తి విడిదిల్లో సాయిని వాసవీ క్లబ్ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆర్యవైశ్య లైన్ అవార్డు విభాగంలో ఫస్ట్ రన్నర్ అప్‌గా 8507 ఓట్లు సాధించారన్నారు. ప్రజాదరణ పొందిన వైశ్య ప్రతినిధులకు అందించే ఆర్యవైశ్య లైమ్ లైట్ -2024 గాను మోస్ట్ పవర్ ఫుల్ వైశ్య ఎంపి అవార్డు లభించిందన్నారు. ఈ నెల 15వ తేదీన హైదరాబాద్ ఫిలింనగర్ జెఆర్‌సిలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా అవార్డు అందుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇమ్మిడి శివ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య ఫెడరేషన్ రాష్ట్ర ఛైర్మన్ కాల్వ సుజాత ఐవిఏఫ్ ఇంటర్నేషనల్ కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, అవార్డు ప్రధాన ఉత్సవ నిర్వాహకులు శివకుమార్, తెలుగు రాష్ట్రాల ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారని తెలిపారు. స్వయంవరం గ్రూపులో 2500 సభ్యులు చేయించాలని తెలిపారు. తనకు ఈ అవార్డు రావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న సాయి

మూగ వేదన..!

తాగునీటికి అల్లాడుతున్న పశువులు
చెరువుల అభివృద్ధి శూన్యం - పట్టించుకోని అధికారులు



వాటాలగుంట పశువుల చెరువులో గేదెలను కడుగుతున్న రైతు

ప్రజాశక్తి - కాళ్ల

ఎండలు ఎక్కువగా ఉండడం, పశువుల చెరువులు అడుగంటడంతో మూగజీవులు నీటికోసం అల్లాడుతున్నాయి. పశుసంవర్ధక శాఖ అధికారులు పశువుల చెరువుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహించడంతో గ్రామాల్లోని చెరువులు అడుగంటాయి. మరికొన్ని గ్రామాల్లో చెరువులు పూర్తిగా కలుషితమై పోయాయి. పశువులు తాగడానికి కూడా పనికిరాకుండా పోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉండి నియోజకవర్గంలో 70 గ్రామాల్లో 62 పశువుల చెరువులు ఉన్నాయి. వాటిలో సగానికిపైగా చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. కొన్ని గ్రామాల్లో పశువుల చెరువులను ఇతరత్రా అవసరాలకు వినియోగించడంతో పశువులకు ఏడాదిపొడుగునా ఇబ్బందులు తప్పడం లేదు. పశువులు తాగునీటి కోసం ఆధారపడుతున్నాయి. నియోజకవర్గంలో తొమ్మిది వేలకుపైగా గేదెలు, ఆవులు ఉన్నాయి. వాటితోపాటు 3 వేల వరకూ మేకలు, గొర్రెలు ఉన్నాయి. పశుసంవర్ధక శాఖ అధికారులు పశువుల చెరువుల పట్ల శ్రద్ధ వహించకపోవడంతో రైతులకు దక్కకుండా పోతున్నాయి. గ్రామ పంచాయతీల ఆధీనంలో పశువుల చెరువులు ఉన్నాయి. వీటిని వేసవికి ముందు నీటితో నింపిన దాఖలాలు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలి..

గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికంగా రైతులు పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్నారు. ఎండల నేపథ్యంలో పశుపోషణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలి. ముఖ్యంగా వడదెబ్బ తగలకుండా చూసుకోవాలి. పాల దిగుబడి తగ్గకుండా జాగ్రత్తలు పాటించాలి. వడదెబ్బ తగిలిన వెంటనే పశువైద్యులను సంప్రదించాలి. లేకుంటే రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది.

జీర్ణక్రియ సమస్యలు..

సాధారణంగా వేసవిలో జీర్ణక్రియ సమస్యలు పశువుల్లో అధికంగా కనిపిస్తాయి. పశువులకు కావాల్సినంత మేత లభించకపోవడం, వేడి కారణంగా తక్కువ ఆహారం తీసుకోవడం, పరిశుభ్రమైన నీరు తాగకపోవడం వల్ల మలబద్ధకం, పారుడు రోగాలు వస్తాయి.

కలుషిత నీటితో వ్యాధులు..

వర్షాకాలం చెరువులోకి చేరిన నీరు మాత్రమే తప్ప ప్రత్యేకంగా పశువుల కోసం చెరువులకు నీరు పెట్టిన సందర్భాలు లేవని పశు పోషకులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులు కలుషిత నీరు తాగితే పారుడు వ్యాధి సోకుతుందని, దీంతో పశువులు చిక్కిపోయి చనిపోయే ప్రమాదం కూడా ఉందని అంటున్నారు. అలాగే కడుపులో జలగ వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది.

చెరువులను అభివృద్ధి చేయాలి



సుభాజత్తుల బాలకృష్ణ, రైతు, ఏలూరుపాడు

పశువుల చెరువుల్లో నీరు లేదు. దీంతో పశువులు నీటికోసం అల్లాడిపోతున్నాయి. ప్రత్యేకంగా పశువుల కోసం ఉన్న చెరువులను అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంతో అధ్వానంగా మారాయి. వాటిని అభివృద్ధి చేయాలి.

పట్టించుకునే వారే లేరు



నిమ్మకాయల వెంకటేశ్వరరావు,పశుపోషకులు, ఏలూరుపాడు

వాటాలగుంట పశువుల చెరువును పట్టించుకునే వారే కరువయ్యారు. ఒకప్పుడు ఈ చెరువు ఐదెకరాల విస్తీర్ణంలో ఉండేది. ఆక్రమణలతో ప్రస్తుతం మూడెకరాలకు మారింది. గతంలో రైతులు, పశుపోషకుల విరాళాలతో చెరువు అభివృద్ధి పనులు చేశాం. నేడు ఆ చెరువు అభివృద్ధి కోసం ఎవరూ శ్రద్ధ చూపడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పశువుల చెరువులను అభివృద్ధి చేయాలి.

ఘనంగా యోగా దినోత్సవం

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం పిహెచ్‌సి పరిధిలోని తొమ్మిది హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లో శుక్రవారం ప్రపంచ యోగా డే నిర్వహించారు ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ 30 నిమిషాల పాటు ప్రతిరోజూ యోగా చేయడం వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. హెల్త్ కమ్యూనిటీ అధికారి జాలాది విల్సన్ బాబు మాట్లాడారు. కార్యక్రమంలో లిటిల్ హెల్త్ ప్రొవైడర్స్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.కాశిపాడులో హై స్కూల్ వద్ద యోగా డే నిర్వహించారు. ఎంఇఒ పి.శేషు మాట్లాడారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు కొయ్యల వెంకటసుబ్బారావు, జనసేన నాయకులు చింత చరణ్ హైస్కూల్ హెచ్‌ఎం ఎఎస్ఎస్‌బిఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.



నరసాపురం : యోగా చేస్తున్న విద్యార్థులు

పెనుగొండ : ఎస్‌వికెపి కెవిఎస్.రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రీడా భాగం ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, మహిళా సాధికారత సంయుక్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ వైవివి.అప్పారావు మాట్లాడారు. గవర్నమెంట్ హాస్పిటల్ ఆయుష్ మెడికల్ ఆఫీసర్ సిహెచ్ సులక్షణమణి, యోగా గురువు పి.రామచంద్రారెడ్డి మాట్లాడారు. ఈ సమావేశంలో ఫిజికల్ డైరెక్టర్ బాపిరెడ్డి, చిరంజీవి, టి.దివాకర్, పి.మీరయ్య పాల్గొన్నారు.

పోడూరు : యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందుతుందని యోగా టీచర్ తరపట్ల మోహనరావు అన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా కవిటం సచివాలయం-1లో యోగా టీచర్ తరపట్ల మోహనరావు గ్రామస్తులకు, ఉపాధి హామీ కూలీలకు యోగాసనాలు నేర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి చుట్టుగుళ్ల పూర్ణిమ, పంచాయతీ కార్యదర్శి జి.సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ఆచంట : సహజ యోగా చేయడం ద్వారా రోగాలు దరి చేరవని పాలకొల్లుకు చెందిన యోగా గురువులు సిహెచ్ సతీష్ కుమార్, జి.ఫణిబాబా అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆచంట రామేశ్వర స్వామి సత్రంలో మండల పరిషత్ కార్యాలయం, ఆచంట పంచాయతీ కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం యోగా గురువులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ రాజేంద్రప్రసాద్, ఇఒపిఆర్‌డి మూర్తిబాబు, పంచాయతీ కార్యదర్శి నరసింహారావు పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : యోగా ద్వారా ఆరోగ్యం పొందొచ్చని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు. భీమవరంలోని భారతీయ విద్యా భవన్ పాఠశాల వద్ద యోగా దినోత్సవం సందర్భంగా 'స్వయం, సమాజం కోసం యోగా' అన్న థీమ్‌తో ఈ ఏడాది నిర్వహించిన యోగా డే కార్యక్రమానికి మంత్రి శ్రీనివాస్ వర్మ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌వర్మ మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులో, పోటీ పరీక్షల్లో మానసిక ఒత్తిడి నుంచి బయటపడేందుకు ఆటలు, యోగా సాధన చేయించాలని తెలిపారు. జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల మాట్లాడుతూ టెక్నాలజీ, ఆధునిక సాధనాల మూలంగా శారీరక శ్రమ తగ్గిపోయిందన్నారు. తొలుత కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల, జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య, ఇతర అధికారులు, విద్యార్థులతో కలిసి యోగా చేశారు. అనంతరం పాఠశాల యాజమాన్యం కేంద్ర మంత్రి, జిల్లా కలెక్టర్, తదితరుల సత్కరించారు. కార్యక్రమంలో డిఆర్ఒ జె.ఉదయ భాస్కరరావు, జిల్లా అదనపు ఎస్‌పిలు భీమారావు, ఎటివి రవికుమార్, భారతీయ విద్యా భవన్ సెక్రటరీ యుకె విశ్వనాథరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ కెవి.మురళీకృష్ణంరాజు మాట్లాడారు. అనంతరం యోగా గురువు పి.రమేష్ రాజును సత్కరించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కెమిస్ట్రీ హెడ్ పి.భవాని, డాక్టర్ వినోద్‌కుమార్, యోగా ట్రైనర్ బాపిరాజు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆర్.కృష్ణచైతన్య పాల్గొన్నారు.

భీమవరం మండల న్యాయ సంస్థ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. స్థానిక 2వ అదనపు జ్యుడీషియల్ కమిషన్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో స్థానిక న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి యోగా తరగతులు నిర్వహించారు.

కాళ్ల : యోగా వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెఎల్ ఎం.శాస్త్రి అన్నారు. శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ఆదేశాలతో ఎస్‌బిహెచ్ వాలంటీర్ పెంటపాటి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెఎల్ ఎం.శాస్త్రి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్రావు పాల్గొన్నారు.

మొగల్తూరు : రోజూ క్రమం తప్పకుండా యోగా చేయడంతో ఆనందంగా, ఉత్సాహంగా ఉంటారని పలువురు వక్తలు అన్నారు. మొగల్తూరులోని అభ్యాస కళాశాల, ముత్యాలపల్లిలోని ఎంపిపి పాఠశాలలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాపై అవగాహనా ప్రదర్శన చేశారు. కార్యక్రమాల్లో సామాజిక సేవాకర్త నాగిడి రాంబాబు, మానేపల్లి సుబ్బారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చక్రవర్తి, తాతారావు పాల్గొన్నారు.

నరసాపురం : యోగా దినోత్సవం సందర్భంగా శ్రీసూర్య డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. ఈ సమావేశానికి కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ అధ్యక్షత వహించారు. బ్రహ్మాజీ మాట్లాడారు. వైఎన్ కళాశాల యోగా మెడిటేషన్ హాల్లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, 10వ అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, ఆర్.వరలక్ష్మి, కె.శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్యనాయుడు పాల్గొన్నారు.

సంసిధ్ స్కూల్లో యోగా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ యోగా చేయడం వల్ల ఏకాగ్రత అలవడుతుందన్నారు. సంసిధ్ స్కూల్ యాజమాన్యం ప్రతి సంవత్సరం యోగా పట్ల అభిరుచిని కనబరుస్తూ అంతర్జాతీయ యోగా దినోత్సవం జరపడాన్ని అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ వి.దుర్గా లావణ్య మాట్లాడుతూ స్కూల్ ఛైర్మన్ వాసా శ్రీనివాసరావు ప్రతి విద్యార్థికీ ఎల్‌కెజి నుండి పదో తరగతి వరకూ ప్రతిరోజూ యోగా క్లాస్ అయిన తర్వాతే రెగ్యులర్ క్లాసులు నేర్పించామని తెలిపారు.

ఉండి : యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యమని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సిహెచ్.ధనలక్ష్మి అన్నారు. యండగండి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ డి.బెన్నీ శామ్యూల్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సిహెచ్ ధనలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో యండగండి పిహెచ్‌సి వైద్య విస్తరణాధికారి రత్నరాజు, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పెనుమంట్ర : ఆరోగ్య వంతమైన జీవనం, సమాజం యోగా వల్ల సాధ్యమవుతాయని ఎంపిడిఒ పి.పద్మజ అన్నారు. యోగా డే సందర్భంగా పెనుమంట్ర గ్రామానికి చెందిన అమృత్ సరోవర్ చెరువు వద్ద జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి తాడిపర్తి ప్రియాంక, ఉప సర్పంచి భూపతిరాజు శ్రీనివాస్‌రాజు పాల్గొన్నారు.**పాలకొల్లు :** స్థానిక జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలలో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో యోగా ప్రతిజ్ఞ చేయించి, యోగాసనాలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే డిఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఎన్ఎస్ఎస్ శాఖల ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. యోగా శిక్షకులు, ఎపి బాక్సింగ్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరి చిట్టూరి చంద్రశేఖర్, ప్రిన్సిపల్ శోభారాణి మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్, పిడి.రమేష్, విజయలక్ష్మి, రేవతి, సత్యనారాయణ పాల్గొన్నారు. ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాయామ విద్య, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి మాట్లాడారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందితో యోగాసనాలు వేయించారు.

పాలకొల్లు రూరల్ : లంకలకోడేరు పిహెచ్‌సిలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్, డాక్టర్ నవ్య జీవన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, పిహెచ్‌సి ఎన్‌పి.ఎలిజిబెత్, సీనియర్ అసిస్టెంట్ రమేష్ బాబు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్ : పెదతాడేపల్లిలోని అంబేద్కర్ గురుకులంలో యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పి.శ్యామ్ సుందర్, ఎపిసి సర్వశిక్ష జిల్లా వారు హాజరయ్యారు. యోగా గురువు కె.రామకృష్ణ యోగా ఉపయోగాలు వివరించారు. అనంతరం యోగా గురువులను పాఠశాల సిబ్బంది సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పి.అన్నవరం, గూడెం ఎంఇఒ-1 హనుమ, ఎంఇఒ-2 జ్యోతి, ఎఎంఒ రామ కోటేశ్వరరావు, చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : యోగా దినోత్సవాన్ని ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.లక్ష్మీసరోజ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రభుత్వ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రశేఖరరావు, ప్రిన్సిపల్ సరోజ మాట్లాడారు. యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని వాణి స్కూల్ డైరెక్టర్ వాణీకృష్ణ అన్నారు. యోగా దినోత్సవాన్ని వాణీ పబ్లిక్ స్కూల్లో నిర్వహించారు. వాణి పబ్లిక్ స్కూల్ అధినేత, ప్రిన్సిపల్ కొల్లి సూర్యకృష్ణ మాట్లాడారు.భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో యోగా దినోత్సవం నిర్వహించారు. శశి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా శిక్షకులు సుధాకర్, సుజాత కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది చేత యోగాసనాలు వేయించారు. కళాశాల ఛైర్మన్ బూరుగుపల్లి వేణు గోపాలకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల డీన్స్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ రఫీ పాల్గొన్నారు.

ఆకివీడు : యోగాతో మానవుడు ఆరోగ్యాన్ని పొందొచ్చని పతంజలి యోగా ఆరోగ్య కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బలరాం ప్రతాప్‌కుమార్ అన్నారు. యోగా దినోత్సవాన్ని మండలంలోని పలు పాఠశాలల్లో, వివిధ సంస్థల్లో నిర్వహించారు. పతంజలి యోగా ఆరోగ్య కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ప్రతాప్ కుమార్ మాట్లాడారు. ఎండిఒ కార్యాలయంలో యోగాసనాలు వేశారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో యోగా డే నిర్వహించారు.

మూగజీవాల పట్ల ప్రేమతో మెలగాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

మూగజీవాల పట్ల ప్రేమతో ఉండాలని వెటర్నరీ వైద్యులు గొట్టిముక్కల నీలిమ విద్యార్థులకు సూచించారు. జంతుహక్కుల అవగాహనా వారాన్ని పురస్కరించుకుని శుక్రవారం మొగల్తూరులోని పెన్మత్స రంగరాజు జడ్‌పి ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇంటి పరసరాల్లో తిరిగే పశుపక్ష్యాదులకు నీరు, పండ్లు, చిరుధాన్యాలు అందుబాటులో ఉంచడం ద్వారా వాటి మనుగడకు మేలు చేసిన వారమవుతామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వర్ధమాని రవిశంకర సర్కార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు

ఐఐటిలో దేవీచంద్రికకు సీటు

ప్రజాశక్తి - మొగల్తూరు

జాతీయ స్థాయిలో నిర్వహించిన ఇంజినీరింగ్ పరీక్షల్లో కొత్తోట గ్రామానికి చెందిన కొల్లాటి దేవీచంద్రిక చత్తీస్‌ఘడ్‌లోని బిలాయ్‌లో ఐఐటిలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ)లో ప్రవేశం పొందింది. దేవీచంద్రిక ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివారు. అనంతరం భీమవరంలోని ఓ ప్రయివేటు కళాశాలలో ఇంటర్ పూర్తి చేసింది. గేట్ పరీక్ష ఫలితాల్లో 5994 ర్యాంకు సాధించింది. తండ్రి ఏసుబాబు వ్యవసాయ కూలీ, తల్లి సూర్యకళ గృహిణి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామరాజు, ఉపాధ్యాయుల దొంగ చింతయ్య, గ్రామస్తులు ఆమెను అభినందించారు.

డిజిపిని కలిసిన నాయకర్

నరసాపురం: రాష్ట్ర నూతన డిజిపిగా బాధ్యతలు చేపట్టిన సిహెచ్ ద్వారకా తిరుమలరావును నరసాపురం జనసేన ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ శుక్రవారం మంగళగిరి డిజిపి కార్యాలయంలో కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

షర్మిలను కలిసిన అంకెం సీతారామ్

భీమవరం టౌన్: కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిలను కాంగ్రెస్ భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి అంకెం సీతారామ్ శుక్రవారం విజయవాడ పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నియోజకవర్గ పరిస్థితులను ఆమె అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీని అసెంబ్లీని మరింత బలోపేతం చేయాలని తెలిపారు. ఎన్నికల నియమావళి, తర్వాత ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాల గురించి సీతారామ్ ఆమెకు వివరించారు.

విదేశీ విద్య పేరు మార్పుపై హర్షం

పెనుమంట్ర: జగనన్న విదేశీ విద్యా నిధిపేరును అంబేద్కర్ విదేశీ విద్యా నిధిగా మార్చినందుకు దళిత ప్రజా సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రివర్గానికి అంబేద్కర్ ఆలోచన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చవ్వాకుల భరత్ కుమార్, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.